www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 91 | హైదరాబాద్ | గురువారం | 19-06-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## తెలంగాణ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:** ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అఖిల పక్ష ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో పాటు, భాజపా ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, భారాస ఎంపీ రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ''గోదావరిబనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం. రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావరిబనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫీజిబులిటీ నివేదిక సమర్పించింది'' అని వివరించారు.




## 'కాళేశ్వరం'పై కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్!

# అనుకున్నది ఒకటి! అయినదిఇంకోటి!!

- రేవంత్ ప్రభుత్వంలో 'కాళేశ్వరం ప్రాజెక్టు' చిచ్చు
- కమిషన్‌కు జవాబు ఇవ్వలేక ఇరకాటంలో సర్కారు
- కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ఏడాదిన్నరగా పాట్లు
- నోటికొచ్చినట్టు ఆరోపణలు చేసిన ప్రభుత్వ పెద్దలు
- కమిషన్‌కు కీలక డాక్యుమెంట్లివ్వకుండా కుతంత్రాలు
- జస్టిస్ ఘోష్ కమిషన్ ముందుకు కీలక విషయాలు
- క్యాబినెట్ నిర్ణయంతోనే కాళేశ్వరంపై ముందుకెళ్లామని
- కమిషన్ విచారణలో కేసీఆర్, హరీశ్, ఈటల స్పష్టీకరణ
- మినిట్స్ ఇవ్వాలని సర్కార్‌కు మూడోసారి కమిషన్ లేఖ
- కమిషన్ లేఖలతో కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లముఖం
- ఎన్డీఎస్ఏ నివేదిక డొల్ల అని ఇప్పటికే ఎల్అండ్‌టీ నిలదీత
- ప్రతికూలతలతో సహచరులపై 'ముఖ్యనేత' రుసరుసలు

**'చెరపకురా... చెడేవు' అన్నారు పెద్దలు! కాళేశ్వరం ఎపిసోడ్‌లో రేవంత్ సర్కారు పరిస్థితి ఇప్పుడు ఇట్లనే తయారైంది. తెలంగాణ వరప్రదాయిని.. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును కాలగర్భంలో కలిపి కేసీఆర్‌ను వ్యక్తిగతంగా బద్నాం చేయాలనే ఏడాదిన్నర కుట్రలు నిష్ఫలమవుతున్నాయనే సంకేతాలు ప్రభుత్వ పెద్దల్లో కలవరం రేపుతున్నాయి. దీంతో రేవంత్‌రెడ్డి సర్కారులో కాళేశ్వరం ప్రాజెక్టు చిచ్చు రాజుకున్నది.**




2

## పార్టీ కోటా మాకెందుకు..

### రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాల్సిందే

- బీసీ సంఘాలు, మేధావుల డిమాండ్
- లేకుంటే స్థానికంలో కాంగ్రెస్‌కు పాతరే
- ప్రభుత్వానికి బీసీ సంఘాల అల్టిమేటం



**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా కాకుండా పార్టీపరంగానే 42% కోటా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైనట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వెనకబడిన వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ పార్టీ దగా చేస్తున్నదని బీసీ సంఘాల నేతలు మండిపడుతున్నారు. పార్టీపరంగా కాకుండా చట్టబద్ధంగానే రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా పాతరేస్తామని హెచ్చరిస్తున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అటకెక్కించేందుకు కాంగ్రెస్ ఆదినుంచీ ఉద్దేశపూర్వకంగానే లోపభూయిష్టమైన విధానాలను అమలుచేస్తున్నదని, ఇప్పుడు పార్టీ కోటా అంటూ మరో కొత్త డ్రామాకు తెరతీసిందని బీసీ సంఘాలు, కుల సంఘాల నేతలు, బీసీ మేధావులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు అశాస్త్రీయ విధానాలతో ఇంటింటి సర్వేను నిర్వహించి ఆదిలోనే బీసీలను వంచించిందని మండిపడుతున్నారు. అసంబద్ధమైన

మిగతా 2వ పేజీలో

## రెండున్నర నెలల్లో 17,400 కోట్లు

### ఇదీ ఆర్బీఐ నుంచి రేవంత్ సర్కారు తెచ్చిన అప్పు

### తాజాగా బాండ్ల వేలం ద్వారా 4 వేల కోట్ల రుణం



2

## ఎనకటికి ఎవడో ఏదీ అడగకుంటే.. సచ్చిందాకా సాకుతా అన్నాడట

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి కేటీఆర్ విమర్శలు
- పదవుల మీద ఉన్న ధ్యాస.. తెలంగాణ ప్రజలపై లేదంటూ ధ్వజం
- ఎన్నికల కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్న మాజీ మంత్రి



3

## కాంగ్రెస్‌లో కట్టప్ప!

### పోటీ వస్తున్నాడని అణగదొక్కిన 'ముఖ్యనేత'!

- నం.2 నోరుమూత!
- ఒకప్పుడు ప్రభుత్వంలో చక్రం తిప్పిన నేత
- కేంద్ర ఏజెన్సీల వరుస దాడులతో తగ్గిన పరపతి
- నిన్నమొన్నటిదాకా ఇతర శాఖల్లోనూ వేలు
- ఇప్పుడు తన శాఖకే పరిమితమై గప్‌చుప్
- సొంత పార్టీ నాయకుల నుంచే '30 శాతం' ఆరోపణలు
- భూముల వ్యవహారాలపై కోర్టుల్లో కేసులు
- శాఖలు మార్చాలని అధిష్ఠానానికి ఎమ్మెల్యేల ఫిర్యాదుల వెల్లువ



**పాలనాపరంగా ముఖ్యనేత విఫలమయ్యారని ఇప్పటికే ఢిల్లీ పెద్దలకు అర్థమై ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ పరిస్థితిని ఏడాది ముందే ఊహించిన ఆ ముఖ్యనేత.. తనకు పోటీ అని భావించిన నేతలను రాజకీయ ఉచ్చులో పడేసి వారిపై అవినీతి, అసమర్థ ముద్రలు వేయించడంలో సఫలమైనట్టు చర్చ కొనసాగుతున్నది. ముఖ్యనేత తమకు ప్రాధాన్యం ఇచ్చినట్టే ఇచ్చి నిండా ముంచారని, తమ వేలితో తమ కన్నునే పొడిపించారని సదరు మంత్రులు వాపోతున్నారు. ఇలా సదరు ముఖ్యనేత రాజకీయ కుట్రలకు బలైన కాంగ్రెస్ ముఖ్యుల కథనాలు వరుసగా..**

2

## రైతుల పక్షాన మరో పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం..


- సాగునీటి ప్రాజెక్టుల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యంపై పోరుకు రెడీ..
- కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం
- రైతుల పక్షాన మరో పోరాటానికి సిద్ధమవుతున్న బీఆర్ఎస్
- రైతుల కొరకు ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయం



3

## గూగుల్ సంస్థకు మా 'వాళ్లే' పోటీ!

- హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి
- నైపుణ్యాభివృద్ధికి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి



3

## రేవంత్ రెడ్డి ఆ పని చేస్తేనే నామినేషన్లు వేయనిస్తాం

బీసీ రిజర్వేషన్లకు రేవంత్ అనుమతి తీసుకురావాలని డిమాండ్

3

## "వాళ్లను గుడిలోకి రానివ్వొద్దు"

రాజాసింగ్ కీలక సూచన

2

## రైతుల చేతులకు సంకెళ్ళు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే హరీష్ రావు



3

# పార్టీ కోటా మాకెందుకు.. రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి

గణాంకాల ఆధారంగా విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, స్థానికసంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లులు పెట్టి, మరోసారి వంచించిందని ఆరోపిస్తున్నారు.

అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినా, దానిని గవర్నర్‌తో ఆమోదింపజేసేందుకు ఎలాంటి చొరవ తీసుకోలేదని, ఇది కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమని రగిలిపోతున్నారు. చట్టబద్ధంగా 42% రిజర్వేషన్ అమలుచేయాలనే ఉద్దేశం కాంగ్రెస్‌కు ఏకోశాన లేదని, మభ్యపెట్టేందుకే కులగణన, బిల్లుల ఆమోదం తప్ప మరేమీలేదని బీసీ సమాజం మండిపడుతున్నది. ఇప్పుడు పార్టీ కోటాలోనే 42% రిజర్వేషన్ అమలుచేసేందుకు పూనుకోవడమే అందుకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని అమలుచేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బీసీలకు 42% రిజర్వేషన్లు, అదీకూడా బీసీ ఉపకులాల వారీగా కల్పించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీసీలకు రెండు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వకుండా మోసం చేసిందని గుర్తుచేస్తున్నారు. ఇక మంత్రి పదవుల్లోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు ప్రాధాన్యం ఇవ్వలేదని మండిపడుతున్నారు. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాలను ఎంతమాత్రం సహించేది లేదని హెచ్చరిస్తున్నారు.

### బీసీ రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి దగా

42% రిజర్వేషన్ల పెంపుపై రేవంత్‌రెడ్డి సర్కార్ బీసీలను దగా చేస్తున్నది. చట్టబద్ధంగా కాకుండా పార్టీపరంగా ఇస్తామనడం మోసం చేయడమే. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుండా తప్పించుకోవాలని చూస్తే, బుద్ధి చెప్పకతప్పదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదినుంచీ బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నది. చట్టబద్ధంగా రిజర్వేషన్లను అమలుచేయకుండా తప్పించుకోవాలని చూస్తే రాష్ట్రంలో మరో సంగ్రామం తప్పదు.

**-ఆర్ కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ**

### ద్రోహాన్ని వివరిస్తాం

బీసీలకు 42% రిజర్వేషన్లు పార్టీపరంగా కల్పిస్తామని చెప్పడం బీసీలను మోసం చేయడమే. ఇటువంటి నిర్ణయాన్ని బీసీ ప్రజలు అంగీకరించరు. ఒకవైపు బీసీల కులగణన దేశానికే ఆదర్శమని, రాహుల్‌గాంధీ అభినవ అంబేద్కర్ అని ఢిల్లీలో గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అందుకు పూర్తి విరుద్ధంగా బీసీ రిజర్వేషన్లకు ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ద్రోహాన్ని గ్రామ గ్రామం తిరిగి వివరిస్తాం. బీసీ ప్రజలను చైతన్య పరుస్తాం.

**-డీ రాజారాంయాదవ్, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు**

### కాంగ్రెస్ మరోమారు మోసం



బీసీలను కాంగ్రెస్ మరోమారు మోసగించింది. బీసీలపై ముఖ్యమంత్రికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయలేదు. స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగరంగాల్లో చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు అమలుకు ఎలాంటి చర్య తీసుకోలేదు. అవేవీ చేయకుండా పార్టీ కోటా అనడం సిగ్గుచేటు. ఇది బీసీ వర్గాలను మరోసారి మోసగించడమే. చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలుపరచాలి. లేదంటే మరో ఉద్యమం తప్పదు. బీసీలకు ఏదీ చెప్పినా నమ్ముతారు అనుకుంటే పొరపాటే.

**- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

### ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి

బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే చేతులు కాల్చుకోక తప్పదు. ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని హెచ్చరిస్తున్నాం. తక్షణమే బీసీ రిజర్వేషన్లపై బీసీ సంఘాలు, మేధావులు, న్యాయ నిపుణులు, అఖిలపక్ష పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలి. ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలి. లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడుతాం. బీసీ సంఘాలు, మేధావులతో చర్చించి ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తాం.

**- జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు**

# రెండున్నర నెలల్లో 17,400 కోట్లు

## ఇదీ ఆర్బీఐ నుంచి రేవంత్ సర్కారు తెచ్చిన అప్పు

## తాజాగా బాండ్ల వేలం ద్వారా 4 వేల కోట్ల రుణం

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడంలో విఫలమైన రేవంత్‌రెడ్డి సర్కారు.. అప్పులు చేయడంలో మాత్రం అడ్డూ అదుపూ లేకుండా ముందుకు సాగుతున్నది. అలా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526)లోని తొలి రెండున్నర నెలల్లోనే రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి రూ.17,400 కోట్ల అప్పు తెచ్చింది. దీనిలో భాగంగా మంగళవారం సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రూ.4 వేల కోట్ల రుణం తీసుకున్నట్టు ఆర్బీఐ ప్రకటించింది.



33 ఏండ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 34 ఏండ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 35 ఏండ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 36 ఏండ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్ల చొప్పున 7.09% వార్షిక వడ్డీతో ఈ రుణాలు సమీకరించినట్టు వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల రుణాలు సమీకరిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించిన రేవంత్‌రెడ్డి సర్కారు.. తొలి త్రైమాసికం (ఏప్రిల్‌జూన్)లో రూ.14 వేల కోట్ల రుణాల కోసం ఆర్బీఐకి ఇండెంట్ పెట్టింది. అందులో భాగంగా ఏప్రిల్ నెలలో మూడు దఫాల్లో రూ.4,400 కోట్లు, మే నెలలో రెండు విడతల్లో రూ.4,500 కోట్లు, జూన్‌లో ఇప్పటికే మూడు దఫాల్లో రూ.8,500 కోట్ల రుణాలు సమీకరించింది. దీంతో ప్రతిపాదించిన మొత్తం కంటే రేవంత్‌రెడ్డి సర్కారు అధికంగా అప్పు తీసుకున్నట్టయింది.

# "వాళ్లను గుడిలోకి రానివ్వొద్దు"

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

త్వరలో బోనాల పండుగ రానుంది. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ గుడి కమిటీ సభ్యులకు కీలక సూచనలు చేశారు. బోనాలు ఉత్సవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్క గుడి కమిటీ మెంబర్స్ గుడి బయట ఒక బ్యానర్ పెట్టాలని కోరారు. "మద్యం తాగి మా గుడి లోపట రావద్దు" అని అందులో రాయాలన్నారు.



ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ.. "ప్రతి ఒక్క గుడి దగ్గర ఒక బ్యానర్ పెట్టాలి. బోనాలు అంటే ఆడే బోనాలు కాదు. ఇవాళ మనం చేస్తున్నాం.. 18,19,20 ఏళ్ల పిల్లల దృష్టిలో బోనాలు అంటే తాగాలే.. ఆడాలే.. డ్యాన్స్ చేయాలే అని వాళ్ల మైండ్‌లో ఫిక్స్ అయింది. దేశ సేవకు ఎప్పుడైనా యువకుల అవసరం పడితే.. గన్ పట్టుకోరా అంటే చేతకాకుండా అవుతుంది. మీ ఫ్యామిలీని కూడా రక్షించుకోలేరు. ప్రస్తుతం అలాంటి పిల్లలు తయారవుతున్నారు. అందుకే.. ఎవరైనా తాగి వస్తే గుడిలోపలికి ఎంట్రీ లేదు అని బ్యానర్ పెట్టాలి. సమాజాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉంది. బోనాలు అంటే మంచిగా వర్షం పడాలి.. పంటలు బాగా పండాలి.. ఎలాంటి రోగాలు వ్యాపించవద్దు అని అమ్మవారికి మనం మొక్కుతాం. ఈ విషయం ఎవరికి తెలియదు. ప్రస్తుతం ఉన్న యువతకు బోనాలు ఎందుకు చేస్తారు? అని అడగండి.. బోనాలు అంటే.. మద్యం, డ్యాన్స్, డీజే అని చెబుతారు. ఇప్పుడు ఉన్న పిల్లలకే ఇది అలవాటు అయితే.. వారికి పుట్టే పిల్లల పరిస్థితి ఏంటి? అందుకే మనందరిపై బాధ్యత ఉంది. సమాజాన్ని , సంస్కృతి కాపాడుకోవాలి. అందుకోసం ఒక్కోక్క బ్యానర్ పెట్టాలి." అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్‌లో కట్టప్ప!

## నం.2 నోరుమూత!



- పోటీ వస్తున్నాడని అణగదొక్కిన 'ముఖ్యనేత'!
- ఒకప్పుడు ప్రభుత్వంలో చక్రం తిప్పిన నేత
- కేంద్ర ఏజెన్సీల వరుస దాడులతో తగ్గిన పరపతి
- నిన్నమొన్నటిదాకా ఇతర శాఖల్లోనూ వేలు
- ఇప్పుడు తన శాఖకే పరిమితమై గప్‌చుప్
- సొంత పార్టీ నాయకుల నుంచే '30 శాతం' ఆరోపణలు
- భూముల వ్యవహారాలపై కోర్టుల్లో కేసులు
- శాఖలు మార్చాలని అధిష్ఠానానికి ఎమ్మెల్యేల ఫిర్యాదుల వెల్లువ

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

కాంగ్రెస్ గెలుపు కోసం అంగబలం, అర్థబలం అందించిన కీలక నేత.. అధికారంలోకి వచ్చిన తర్వాత నంబర్ టూగా వెలుగు వెలిగారు. ఓ దశలో శాఖలతో సంబంధం లేకుండా ఆయన చెప్పిందే వేదమన్నట్టు సాగింది. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. సొంతపార్టీ నేతలే అవినీతి ఆరోపణలు చేయడంతోపాటు ఆయన ప్రోద్బలంతో జరుగుతున్న భూముల వ్యవహారాలపై ఏకంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలే కోర్టును ఆశ్రయించారు. మరోవైపు కేంద్ర ఏజెన్సీలు వరుసగా దాడులు చేశాయి. ఫలితంగా ఇప్పుడు సదరు 'నంబర్ 2' నేత గప్‌చుప్ అయిపోయారు. తన శాఖకే పరిమితమయ్యారు. ముఖ్యనేత రాజకీయ వ్యూహంలో నలిగిపోయిన ఆ మంత్రి ప్రస్థానంపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తున్నది.

**అన్నీతానై నడిపి..**

కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో రెండు ఉమ్మడి జిల్లాలది కీలక పాత్ర! ఆ జిల్లాల్లో కాంగ్రెస్ దాదాపు క్లీన్‌స్వీప్ చేసింది. దీని వెనుక ఓ నేత ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలే చెప్తున్నాయి. ఎన్నికల సమయంలో దాదాపు 22 మంది అభ్యర్థులకు ఆర్థిక సాయం చేశారని, అన్నీతానై నడిపారని చెప్పుకొన్నారు. అందుకే ఆయనకు ప్రభుత్వంలో కీలక శాఖ దక్కింది. ఇదే సమయంలో అధిష్ఠానంతోనూ సాన్నిహిత్యం పెరిగింది. తొలి నాళ్లలో ఆయన 'నంబర్ 2'గా వెలుగొందారు. వాస్తవానికి ఆయనకన్నా సీనియర్లు, తరాలుగా కాంగ్రెస్‌నే నమ్ముకొని, సీఎం పదవి రేసులో నిలబడిన నేతలున్నా ఆ మంత్రినే 'నంబర్ 2'గా పిలుచుకునేవారు. ఈ విషయాన్ని ఒకట్రెండు చోట్ల ఆయనే స్వయంగా ప్రకటించుకున్నారు. ఒకప్పుడు ప్రభుత్వంలో ఆయన చెప్పిందే వేదమన్నట్టుగా నడిచేది. శాఖలతో సంబంధం లేకుండా అన్ని విభాగాలపై సమీక్షల్లో పాల్గొనేవారు. ఆయా శాఖలకు సంబంధించిన నిర్ణయాలను స్వేచ్ఛగా వెల్లడించేవారు. ముఖ్యమంత్రిని మారుస్తారన్న ప్రచారం జరిగిన ప్రతిసారీ ఈయన పేరు బలంగా వినిపించేది. సచివాలయంలోనూ ఆయనను కలవడానికి రోజూ వందలాది మంది క్యూ కట్టేవారు.

**పోటీగా ఉన్నారని అణచివేత**

రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి నుంచి తాజాగా ఢిల్లీకి చేరిన నివేదికలో 'నంబర్ 2' మంత్రి ఫైల్ కూడా ఉన్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తండ్రీకొడుకులపై ఆరోపణల నేపథ్యంలో ఆయన శాఖలను మార్చాలని ఢిల్లీ పెద్దలు సూచించినట్టు సమాచారం. 'నేనే అడ్డంపడి నీ పదవిని కాపాడిన' అంటూ ముఖ్యనేత ఆ మంత్రితో చెప్పినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. 'నంబర్ 2'గా తనకు తానే ప్రకటించుకోవడం, తనతో పోటీగా అన్ని శాఖలపై సమీక్షలు చేయడం, అధిష్ఠానం దగ్గర సాన్నిహిత్యం పెంచుకోవడం వంటి పరిణామాలు ముఖ్యనేతకు రుచించలేదని పేర్కొంటున్నారు. ఇటీవల సదరు నేత ప్రభుత్వ సదస్సులను అడ్డం పెట్టుకొని హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టడం, గతంలో తాను ఫండింగ్ చేసి గెలిపించిన ఎమ్మెల్యేలను వరుసగా కలుస్తుండటం ముఖ్యనేతకు రుచించలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు సోదిలో లేని పార్టీని తాను నెలబెట్టి గెలిపించానని, కానీ మొత్తం ఆయన వల్లే జరిగినట్టుగా నంబర్ 2 నేత చెప్పుకోవడం ముఖ్యనేతకు విసుగు తెప్పించిందని సమాచారం.

ఇక ప్రభుత్వ నిర్ణయాలను తనకన్నా ముందే సదరు నేత చెప్పేయడంపైనా తీవ్ర అసహనంతో ఉన్నట్టు తెలిసింది. అందుకే ఇంటా, బయటా పొగబెట్టించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సదరు మంత్రి భూముల వ్యవహారాలపై ముఖ్యనేత దగ్గరుండి తన వర్గం ఎమ్మెల్యేలతో అటు అధిష్ఠానానికి ఫిర్యాదులు, ఇటు న్యాయస్థానాల్లో పిటిషన్లు వేయించారని చెప్తున్నారు. ఇక మంత్రి దగ్గర పనిచేస్తున్న ఇద్దరు అధికారులను ఆయనకు తెలియకుండానే మార్చేశారని సచివాలయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మంత్రికి చాలా సన్నిహితంగా ఉండి, భూముల వ్యవహారాలను దగ్గరుండి చూస్తున్న ఓ ఉన్నతాధికారిని తాజాగా వేరే శాఖకు బదిలీ చేశారని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం ఏర్పడగానే మొదటి విడతలోనే ఆయనను బదిలీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ సదరు మంత్రికి దగ్గరై వ్యవహారాలన్నీ చక్కబెడుతుండటంతో ఇప్పట్లో బదిలీ జరగదని అంతా అనుకున్నారు. మంత్రికి చెప్పకుండానే అకస్మాత్తుగా వేరే శాఖకు బదలాయించారని చెప్పుకుంటున్నారు. దీంతో ఆయన గప్‌చుప్ అయ్యారని సమాచారం. ఇలా ముఖ్యనేత దెబ్బకు విలవిలలాడుతున్న 'నంబర్ 2'.. ఇదే ముఖ్యనేత వల్ల అవినీతి ముద్ర వేయించుకున్న మరో 'నంబర్ 2' నేతకు దగ్గరవుతున్నారని ఆ ఉమ్మడి జిల్లా నేతలు చెప్తున్నారు. మొదట్లో ఇద్దరి మధ్య దూరం ఉండేదన్నది బహిరంగ రహస్యమే కాగా కొంతకాలంగా వారి మధ్య సఖ్యత పెరగడం గమనార్హం.

**ఇంటా, బయటా వివాదాలు**

అంతా బాగానే ఉన్నదని అనుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కేంద్ర నిఘా సంస్థలు రంగ ప్రవేశం చేశాయి. ఆ మంత్రి కుమారుడిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. వరుసగా నిఘా సంస్థలు ఆ మంత్రి ఇల్లు, ఆఫీస్, కుటుంబ సభ్యుల ఇండ్లపై దాడులు చేశాయి. కేంద్ర ప్రభుత్వానికి 'ఎవరు ఉప్పందించారో' తెలియదుగానీ మంత్రి పరువును జాతీయ స్థాయిలో తీసేశారంటూ కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వంలోని 'ప్రధాన' నేతకు సన్నిహితులు ఉండే రాష్ట్ర ముఖ్యనేత బాగానే 'ఖర్చు' చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మంత్రిపై అవినీతి ఆరోపణలు చేశారు.

30 శాతం కమీషన్ ఇస్తే తప్ప తమ మంత్రి పని చేయరంటూ బాంబు పేల్చారు. దీంతో ఆయనపై 30 పర్సెంట్ మంత్రిగా ముద్రపడిందని చెప్తున్నారు. ఫలితంగా కొన్నాళ్లుగా ఆయన గప్‌చుప్ అయ్యారు. తన శాఖకు మాత్రమే పరిమితమయ్యారని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో రూ.10 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయంటూ నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ భూముల వ్యవహారం వెనుక కూడా 'నంబర్ 2' నేతనే ఉన్నట్టు రెవెన్యూ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదేకాదని, గతంలోనూ అనేక భూ వ్యవహారాల్లో సదరు నేత ప్రమేయంపై అధిష్ఠానానికి ఫిర్యాదులు చేరినట్టు సమాచారం. ఈ పరిణామాలతో హైదరాబాద్‌లో ఉండటం తగ్గించారని, ఎక్కువ సమయం సొంత జిల్లాలోనే గడుపుతున్నారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# 'కాళేశ్వరం'పై కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్! అనుకున్నది ఒకటి! అయినదిఇంకోటి!!

- రేవంత్ ప్రభుత్వంలో 'కాళేశ్వరం ప్రాజెక్టు' చిచ్చు
- కమిషన్‌కు జవాబు ఇవ్వలేక ఇరకాటంలో సర్కారు
- కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ఏడాదిన్నరగా పాట్లు
- నోటికొచ్చినట్టు ఆరోపణలు చేసిన ప్రభుత్వ పెద్దలు
- కమిషన్‌కు కీలక డాక్యుమెంట్లివ్వకుండా కుతంత్రాలు
- జస్టిస్ ఘోష్ కమిషన్ ముందుకు కీలక విషయాలు

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

శత్రువుకు శత్రువు... మిత్రుడు అన్నట్టు సంవత్సరన్నర నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిష్ఠను మసకబార్చే ప్రయత్నంలో కాంగ్రెస్ సర్కార్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లూ తాము నోటికొచ్చినట్టు చేసిన ఆరోపణలకు ఎన్డీఎస్ఏ నివేదిక రూపంలో అధికారిక ముద్ర పడుతుందనే ఆశలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారు. కానీ ఎన్డీఎస్ఏ నివేదిక డొల్ల అని ఎల్అండ్‌టీ తేల్చడంతో కేంద్రం కూడా చేతులెత్తేసింది. తాజాగా చివరిదశకు చేరుకున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముచ్చటగా మూడోసారి 'గత ప్రభుత్వ క్యాబినెట్ మినిట్స్ కావాలి' అంటూ పట్టుబట్టడంతో రాష్ట్ర ప్రభు త్వం తలపట్టుకున్నట్టు తెలుస్తున్నది. చివరకు ఇది ఇటీవలి క్యాబినెట్ సమావేశంలో ఒక సహచరునిపై 'ముఖ్య'నేత రుసరుసలదాకా వెళ్లినట్టు తెలిసింది.

అందుకే సదరు సహచరుడిని ఇరకాటంలో పెట్టేందుకు ఘోష్ కమిషన్ లేఖ విషయాన్ని ముఖ్యనేత లీకుగా వదిలారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై 'ఏమనుకుంటె.. ఏమా యె?!' అని తాము వేసిన ఉచ్చు తమమెడకే చిక్కుకుంటుందనే నైరాశ్యం 'ముఖ్య' శిబిరాన్ని ఆవహిస్తున్నదని విశ్వసనీయ సమాచారం. అం దుకే అంశం ఎంత పెద్దదయి నా సరే.. ఓ చిన్న లాజిక్‌తో పరిసమాప్తం అవుతుందనేది చారిత్రక సత్యం. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టుపై సంవత్సరంన్నర కాలంగా చోటుచేసుకుంటున్న రాజకీయ రాద్ధాంతం కూడా ఆ లాజిక్ ముంగిటకు వచ్చి నిలబడింది. అదే రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

దూదిపింజలా ఎగిరిపోయిన ఎన్డీఎస్ఏ నివేదిక

మేడిగడ్డ బరాజ్‌లోని ఒక పిల్లర్ కుంగిన మరుసటి రోజు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 24 వరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్డీఎస్ఏ రూపంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన రసాభాస అంతాఇంత కాదు. తాము ఊహించినట్టుగానే నివేదిక వస్తుంది.. చరిత్రలో కాళేశ్వరం ప్రాజెక్టును చెరిపివేయవచ్చనే ఆశతో ఉన్న ప్రభుత్వ పెద్దలకు ఎన్డీఎస్ఏ తుది నివేదిక ఆశాభంగాన్ని కలిగించింది. వాస్తవానికి ఎన్డీఎస్ఏ విచారణలో భాగంగా అధికారులు అనేక కీలక డాక్యుమెంట్లను అడిగినప్పటికీ ప్రభుత్వం ఇవ్వలేదనే విమర్శలు వచ్చాయి. వీటన్నింటికీ మించి అసలు ఎన్డీఎస్ఏకు తెల్వకుండానే కుంగిన ప్రాంతంలో గ్రౌటింగ్ చేపట్టారని ఆ సంస్థ తన తుది నివేదికలో కుండబద్దలు కొట్టింది. దీంతో తామేమీ చేయలేమంటూ ఎటూ తేల్చకుండానే నివేదికను వెలువరించింది. కుంగుబాటు ఎలా జరిగిందనే సాంకేతిక అంశాలను పొందుపరిచిన అధికారులు అసలు దీనికి బాధ్యులెవరు? అసలు లోపం ఎక్కడ జరిగింది? అనే వివరాలే వెల్లడించలేదు. బరాజ్ పునరుద్ధరణకు ఏం చేయాలనే కనీస సిఫారసులు లేకుండానే తుది నివేదిక ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో ఇదంతా డొల్ల నివేదిక అంటూ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ దిమ్మతిరిగేలా ప్రభుత్వానికి లేఖ రాసింది. ఎన్డీఎస్ఏ ఏమీ చెప్పలేదు సరే.. కనీసం మీరైనా ఏం చేయాలో చెప్పండి అదే చేస్తాం! అంటూ బంతిని సర్కారు కోర్టులోకి నెట్టింది. తామేదో బీఆర్ఎస్‌ను బద్నాం చేసి రాజకీయంగా లబ్ధి పొందాలనుకుంటే సాంకేతిక అంశాల్ని తమ నెత్తిన పెట్టారంటూ సర్కారు పెద్దలకు దిక్కుతోచక కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ పాండ్యాతో కమిటీ వేసి ఎన్డీఎస్ఏ ఎపిసోడ్‌కు శుభం కార్డు వేశారు.


**లాజిక్ ముందర నిలిచిన కాళేశ్వరం**


కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసుకుంటూ వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సంకట స్థితిలో పడిపోయింది. కారణం.. పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి రాస్తున్న లేఖలు. ఇంజినీర్లను సాంకేతిక అంశాలపై విచారించిన కమిషన్.. కేసీఆర్ క్యాబినెట్ మినిట్స్ ఇవ్వాలని రేవంత్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ తర్వాత ముఖ్యకార్యదర్శులు, ఐఏఎస్‌లను ప్రభుత్వపరంగా ప్రొసీడింగ్స్, ఫైల్స్ నిర్వహణపై విచారణ చేసి.. మరోసారి క్యాబినెట్ మినిట్స్ కోసం లేఖ పంపింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని తొక్కిపెడుతూ వచ్చింది. నాటి ముఖ్యమంత్రి, నీటిపారుదల, ఆర్థిక శాఖ మంత్రులు కూడా కమిషన్ ఎదుట హాజరైన తర్వాత ఇక కేసీఆర్ క్యాబినెట్ నిర్ణయాలకు సంబంధించిన మినిట్స్ అత్యంత కీలకంగా మారింది.

ఇటీవల మూడోసారి క్యాబినెట్ మినిట్స్ కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ మినిట్స్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయాలన్నీ కేసీఆర్ ఒక్కరే కాదు! క్యాబినెట్ సమష్టి నిర్ణయమనేది ప్రస్ఫుటం అవుతుంది. అంటే ప్రక్రియ అంతా రాజ్యాంగ బద్ధంగా జరిగినట్టే. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టడమనేది అసాధ్యం. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వానికి రుచించడం లేదు. ఇంతకాలం సాగదీసిన కాళేశ్వరం ప్రాజెక్టు అనే భారీ అంశానికి ఇక శుభం కార్డు పడుతుందన్నది ప్రభుత్వ పెద్దలకు బోధపడిందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా బద్నాం చేయాలనే ఏడాదిన్నర ప్రయత్నాలు ఇక పటాపంచలు కానున్నాయి.

**సర్కారులో చిచ్చుపెట్టిన 'కాళేశ్వరం'**

ఈ నెల 5న జరిగిన మంత్రివర్గ భేటీలో కాళేశ్వరం అంశాన్ని ప్రధాన ఎజెండాగా తొలుత నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేసుకొని క్యాబినెట్ మీటింగ్‌కు వచ్చారు. కానీ చివరి క్షణంలో ఆ అంశాన్ని ఎజెండా నుంచి తొలగించారు. క్యాబినెట్ భేటీలో ఈ అంశం చర్చకు రాకపోవడానికి ఓ సీనియర్ మంత్రి మీద అనుమానమే కారణమని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.





**పరస్పర ఆరోపణలు**

క్యాబినెట్ భేటీకి గంట ముందే సీనియర్ మంత్రితో ముఖ్యనేత దాదాపు 45 నిమిషాల పాటు ప్రత్యేకంగా భేటీ అయినట్టు సమాచారం. ఈ భేటీలో ఒకరికొకరు పరస్పరం ఆరోపణలు చేసుకున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు కేసీఆర్ చేతికి వెళ్తున్నాయని, ఆయనకు చేరవేస్తున్న వారు ఎవరని ముఖ్యనేత నిలదీసినట్టు తెలిసింది. మనలో ఐక్యత లేకపోవటంతోనే ప్రజల్లో ప్రభుత్వం చులకనైపోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. కాళేశ్వరం కమిషన్ విచారణ తాము అనుకున్న దిశలో వెళ్లటం లేదని, తద్వారా బీఆర్ఎస్‌పై రాజకీయంగా ఎక్కుపెట్టిన తుపాకీ గుండు చివరకు తమవైపే వస్తుందనే రీతిలో తీవ్ర పదాలతో వ్యాఖ్యానించినట్టు తెలిసింది. అందుకే కాళేశ్వరం అంశాన్ని క్యాబినెట్ ఎజెండానుంచి తొలగిస్తున్నానని సదరు మంత్రి ముఖం మీదనే చెప్పినట్టు తెలిసింది. ప్రభుత్వంలో రేగిన ఈ కాళేశ్వరం చిచ్చు చివరకు 'ముఖ్య' కేంద్రం నుంచి లీకులకు దారి తీసిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే ఘోష్ కమిషన్ కేసీఆర్ క్యాబినెట్ భేటీ మినిట్స్‌ను ఇవ్వాలని సర్కారుకు లేఖ రాసిందని, దీనిపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నదనే లీకులు ఎంపిక చేసిన మీడియాకు వెళ్లాయి. కానీ తెల్లారేసరికి అది రేవంత్ సర్కారుకు ప్రతికూలంగా జనంలోకి వెళ్లడంతో నాలుక్కరచుకోవడం లీకువీరుల వంతైంది. కేసీఆర్ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు హాజరైన రోజున ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో కాళేశ్వరానికి సంబంధించిన నివేదికలన్నీ బయట పెడతానని చెప్పారు. కానీ ఇంతవరకు వాటి ఊసెత్తకపోవడం గమనార్హం.

**కేసీఆర్ రంగప్రవేశంతో కీలకదశ**

దశాబ్దాల సాగునీటి గోస అనుభవించిన తెలంగాణ రైతాంగాన్ని ఒడ్డుకు చేర్చేందుకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించాలనే విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు మంత్రివర్గ సమష్టి నిర్ణయంతో మహారాష్ట్రతో అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకున్నారు. కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా నిధుల సమీకరణ, కేంద్ర జల సంఘం, కేంద్ర అటవీ, పర్యావరణ, ఇతరత్రా విభాగాల నుంచి రావల్సిన అనుమతుల కోసం తన రాజనీతిజ్ఞతను ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వ్యాప్కోస్‌తో లైడార్ సర్వే చేయించారు. ఎల్అండ్‌టీ వంటి ప్రపంచ దిగ్గజ నిర్మాణ కంపెనీలకు పనులు అప్పగించారు.

ఇవన్నీ కేసీఆర్ సొంత నిర్ణయాలే అన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ఆది నుంచి ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ కమిటీలు, కమిషన్ల ముందుకొచ్చేసరికి అసలు నిజాలు బట్టబయలవుతాయి. పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణలోనూ ఇదే జరిగిందని సాగునీటి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్ విచారణల సమయంలో అప్పటి ప్రభుత్వం సమష్టిగా తీసుకున్న నిర్ణయాల పరంపరను డాక్యుమెంట్లతో సహా కమిషన్ దృష్టికి తెచ్చినట్టు తెలిసింది. దీంతో కమిషన్ తదుపరి అడుగులు అటువైపు వెళుతుండటంతో ప్రభుత్వ పెద్దల్లో కలవరం మొదలైందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

**ప్రాజెక్టు ప్రతిష్టను దెబ్బతీసే యత్నం**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డలో 2023 అక్టోబరు 21న ఓ దురదృష్టకర సంఘటన చోటుచేసుకున్నది. బరాజ్‌లోని 85 పిల్లర్లకు ఒకటి కుంగిపోయింది. దీంతో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై రాజకీయ రాద్ధాంతం మొదలుపెట్టాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కేసీఆర్ వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయమనే కోణంలో ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఏకంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ రంగాన్నే నిర్వీర్యం చేసేందుకు కూడా ప్రభుత్వం వెనుకాడటం లేదు.

### అధిష్ఠానానికి ఫిర్యాదు.. సోనియాకు లేఖ

ముఖ్యనేత నుంచి ఊహించని ఆరోపణలు రావటంతో నిశ్చేష్టుడైన సదరు మంత్రి తీవ్ర ఆందోళనకు గురైనట్టు తెలిసింది. తాను నిఖార్సైన కాంగ్రెస్ నేతనని, పదవుల కోసం పార్టీలు మారలేదని ఆయన ఎదురుదాడికి దిగినట్టు తెలిసింది. ప్రతిపక్షాలకు లీకులు ఇచ్చేంత ఖర్మ తనకు పట్టలేదని, మీలాంటి వాళ్లు ఈ పార్టీ కాకుంటే ఇంకో పార్టీకి వెళ్తారని ఘాటుగా వ్యాఖ్యానించినట్టు తెలిసింది. తాను లీకులు ఇచ్చినట్టు ఆధారాలు చూపించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటావని హెచ్చరించినట్టు తెలిసింది. తనకు జరిగిన అవమానంపై ఏఐసీసీకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. వ్యక్తిగతంగా సోనియాగాంధీకి లేఖ రాసినట్టు సమాచారం.

## రేవంత్ రెడ్డి ఆ పని చేస్తేనే నామినేషన్లు వేయనిస్తాం



- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న కవిత
- బీసీ రిజర్వేషన్లకు రేవంత్ అనుమతి తీసుకురావాలని డిమాండ్
- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని సూచన

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి రాకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లకు అనుమతి తీసుకువస్తేనే నామినేషన్లు వేయనిస్తాం. లేదంటే ప్రతి వార్డులో వందల సంఖ్యలో నామినేషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తాం" అని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ, మండలిలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపామని, పార్లమెంటులో ఈ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు. "జులై రెండో వారం వరకు కేంద్రానికి గడువు ఇస్తున్నాం. ఆలోపు అనుమతి రాకపోతే జులై 17 నుంచి రైలు రోకోలు నిర్వహిస్తాం" అని కవిత హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరిబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, బొల్లాపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అడ్డుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఆపరేషన్ కగార్" పైన కూడా ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఈ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ఆమె కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఎన్‌కౌంటర్లు అమానవీయ చర్యలని, ఈ ఆపరేషన్‌ను తమ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. మావోయిస్టు సమస్యకు చర్చలే పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు.

# ఎనకటికి ఎవడో ఏదీ అడగకుంటే.. సచ్చిందాకా సాకుతా అన్నాడట

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి కేటీఆర్ విమర్శలు
- పదవుల మీద ఉన్న ధ్యాస.. తెలంగాణ ప్రజలపై లేదంటూ ధ్వజం
- ఎన్నికల కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్న మాజీ మంత్రి

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పదవుల మీద ఉన్న ధ్యాస.. తెలంగాణ ప్రజలపై లేదంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. ఎనకటికి ఎవడో ఏదీ అడగకుంటే.. సచ్చిందాక సాకుతా అన్నాడట.. ఆ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరు ఉందని కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా విమర్శించారు.

"ఏస్తున్న రైతుభరోసా సరే. మరి ఎగ్గొట్టిన రైతుభరోసా సంగతి ఏంది..? ఎగ్గొట్టిన వడ్ల బోనస్ సంగతి ఏంది..? ఎగ్గొట్టిన తులం బంగారం, కళ్యాణలక్ష్మి పరిస్థితి ఏంటి..? ఎగ్గొట్టిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పరిస్థితి ఏంటి..? ఎగ్గొట్టిన రూ.2500 మహాలక్ష్మి పథకం పరిస్థితి ఏంటి..? ఆడబిడ్డలకు ఎలక్ట్రిక్ స్కూటీల పరిస్థితి ఏంటి..? ఆగిపోయిన రైతుబీమా పరిస్థితి ఏంటి..? ఆగిపోయిన రుణమాఫీ పరిస్థితి ఏంటి..?" అని కేటీఆర్ నిలదీశారు.

శాసనసభ ఎన్నికల కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి, లోక్‌సభ ఎన్నికల కోసం దేవుళ్ల మీద ఒట్లేసి, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం రైతుభరోసా పేరుతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు కుటిల యత్నాలను తెలంగాణ గమనిస్తుంది. మీ పదవుల గ్యారంటీ కోసం ఉన్న శ్రద్ధ.. తెలంగాణ ప్రజలకు మీరిచ్చిన గ్యారంటీ కార్డు అమలుపై లేకపాయే అని కేటీఆర్ ట్వీట్ చేశారు.



## రైతుల చేతులకు సంకెళ్ళు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్ ):** కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుమరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జోగులాంబ గద్వాల్ జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన రైతులను అరెస్టు చేయడమే కాకుండా నేరస్తులలాగ రైతులకు చేతులకు సంకెళ్ళు వేయడం ఏమిటని మండిపడ్డారు. లగచర్ల నుంచి రాజోలి దాకా ఇలాంటి ఘటనలే పునరావృత్తం అవుతున్నాయని అన్నారు. రైతు చేతులకు సంకెళ్లు వేయడం, పౌరహక్కుల నేతలపై నిర్బంధాలు విధించడం.. సీఎం రేవంత్ రెడ్డిగారూ ఇవేనా మీరు చెప్పిన ఇందిరమ్మ రాజ్యం ఆనవాళ్ళు అంటూ ప్రశ్నించారు.


పెద్ద ధన్వాడలో గత కొన్ని నెలలుగా ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అనేక గ్రామాల ప్రజలపై అక్రమ కేసులు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందని అన్నారు. రైతులకు సీఎం భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే అన్నదాతలే రేవంత్ కు గట్టిగా బుద్ధి చెబుతారని హరీష్ రావు అన్నారు.





# రైతుల పక్షాన మరో పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం..

- కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం
- రైతుల పక్షాన మరో పోరాటానికి సిద్ధమవుతున్న బీఆర్ఎస్
- సాగునీటి ప్రాజెక్టుల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యంపై పోరుకు రెడీ..
- రైతుల కొరకు ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయం



**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ చూపిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంపై తెలంగాణ రైతాంగం తరపున పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ రెడీ అయింది. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంపై చర్చించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో త్వరలోనే కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నది. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, రైతు వ్యతిరేక వైఖరిపై ప్రధానంగా చర్చిస్తారు.

రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం వహించడంపైన చర్చించనున్నారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తి అయిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనబెట్టడంతో పాటు 2 పిల్లర్లు కుంగాయన్న సాకుతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను నాయకులకు కేసీఆర్ వివరిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో లక్షల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందకుండా పోతున్నది. రాజకీయ దురుద్దేశంతోనే అన్నదాతలపైన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించనున్నారు.

ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా ప్రభుత్వం చూపుతున్న అలసత్వం వలన తెలంగాణకు తీరని నష్టం కలుగుతుందని, ఈ అంశంలో ఉద్యమ కార్యాచరణకు బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేయనుంది. ఏడాదిన్నర కాలంగా తెలంగాణ రైతులను నిండా ముంచుతున్న కాంగ్రెస్ ద్రోహాన్ని ఈ కీలక సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సమగ్రంగా చర్చించనున్నారు.

## గూగుల్ సంస్థకు మా 'వాళ్లే' పోటీ!

- హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి
- నైపుణ్యాభివృద్ధికి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి



**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు.

బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

"గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు.

రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. "ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

## మొబైల్ ఫోన్ ఇచ్చేది లేదు ఏసీబీకి కేటీఆర్ లేఖ

- ఏసీబీ నోటీసుపై స్పందించిన కేటీఆర్
- సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనంపై తీవ్ర అభ్యంతరం
- ప్రాథమిక హక్కులు, గోప్యతకు భంగమంటూ లేఖ
- సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించిన మాజీ మంత్రి

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):** ఫార్ములా ఈ కార్ రేసు వ్యవహారానికి సంబంధించి తన సెల్‌ఫోన్‌ను అప్పగించాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) జారీ చేసిన నోటీసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఏసీబీ అధికారులకు ఒక లేఖ రాశారు. ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ విచారణ జరుపుతున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే కేటీఆర్‌ను కూడా అధికారులు విచారిస్తున్నారు.

విచారణలో భాగంగా కేటీఆర్ వాడుతున్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను తమకు అందజేయాలని ఏసీబీ అధికారులు కోరారు. అయితే, తన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరడం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో నొక్కి చెప్పిందని ఆయన గుర్తు చేశారు.

ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను గానీ, ల్యాప్‌టాప్‌ను గానీ ఏసీబీకి అప్పగించాల్సిన అవసరం లేదని న్యాయనిపుణులు కేటీఆర్‌కు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ న్యాయ సలహా మేరకే కేటీఆర్ ఏసీబీకి లేఖ ద్వారా తన నిర్ణయాన్ని తెలియజేశారు



## మురిపించి ఉసూరుమనిపించిన వరుణుడు..

**వానల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు**

**హుజూరాబాద్ రూరల్ జూన్ 18(సిద్దిపేట పవర్ ):** ఈ వానకాలం ప్రారంభంలోనే ముందస్తుగానే రుతుపవనాలు వస్తాయని అన్నదాతలు సంతోషపడ్డారు. కానీ గత 20 రోజుల క్రితం రెండుసార్లు చిరుజల్లులు కురవడంతో రైతులు ఆనందంతో దుక్కులు దున్ని పత్తి విత్తనాలు విత్తారు. కానీ ముందుగానే మురిపించిన వరుణుడు కరుణచూపకుండా వెళ్లిపోయాడు. దీంతో పత్తి విత్తనాలు విత్తిన రైతులు వర్షం కోసం మొగులువైపు దిగాలుగా ఎదురుచూస్తున్నారు. డివిజన్లో లక్ష 10వేల ఎకరాల సాగుకు సిద్ధం హుజురాబాద్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో సుమారుగా లక్షా పదివేల ఎకరాల్లో వివిధ పంటల సాగుకు రైతులు సమయత్తమయ్యారు. దీనిలో సుమారు 70 వేల ఎకరాల్లో వరి పంట, 38వేల ఎకరాల్లో పత్తి, మరికొన్ని ఎకరాల్లో ఇతరాత్ర పంటలు వేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రోహిణి కార్తిలోనే 60000 ఎకరాల్లో సుమారుగా సన్నరకం నార్లు పోసినట్లు తెలిసింది. నార్లు ఇప్పటికే ఏపుగా పెరిగాయి.



వర్షం కోసం పత్తి రైతుల ఎదురుచూపు

20 రోజుల క్రితం పత్తి విత్తనాలు విత్తిన రైతులు వర్షం కోసం మొగులువైపు ఎదురుచూస్తున్నారు. ముందుగా కురిసిన వర్షానికి డివిజన్‌లోని పలు మండలాల్లో సుమారుగా 25 వేల ఎకరాల పైచిలుకే పత్తి విత్తనాలు విత్తారు. అప్పటినుంచి వర్షాలు లేకపోవడంతో విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తలేదు. మరో నాలుగు రోజులలో వర్షాలు కురువకపోతే విత్తనాలు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతుంది అయితే సమృద్ధిగా వర్షాలు కురిసినప్పుడే మరోసారి దుక్కులు దున్ని విత్తాల్సిన పరిస్థితి వస్తుందని దీంతో అన్నదాతల పెట్టుబడులు పెరిగి అప్పుల పాలు అయ్యే అవకాశం ఉందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## చిన్నారుల ప్రాణాలతో చలగాటం..

- తప్పితాగి పోలీసులకు పట్టుబడ్డ స్కూల్ బస్సు డ్రైవర్లు..
- హైదరాబాద్‌లో రెండు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్
- స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు
- యూసఫ్ గూడ బస్తీలో తప్పతాగి పట్టుబడ్డ ఇద్దరు డ్రైవర్లు
- అమీర్ పేట్‌లో పట్టుబడ్డ శ్రీ చైతన్య స్కూల్ బస్సు డ్రైవర్



**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

హైదరాబాద్‌లో రెండు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ డ్రైవ్ పరీక్షల్లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడ్డారు.. యూసఫ్ గూడ బస్తీలో ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు.. అయితే..ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ లో క్వీన్స్, ప్రిజం స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడ్డారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో డ్రైవర్ కు 156 రీడింగ్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో బస్సును స్వాధీనం చేసుకున్నారు. స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. మరోవైపు.. అమీర్ పేట్‌లోనూ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.. శ్రీ చైతన్య స్కూల్ బస్సు డ్రైవర్ కేశవరెడ్డికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా.. 202మోతాదు వచ్చిందని పోలీసుల వెల్లడించారు. దీంతో శ్రీ చైతన్య స్కూల్ బస్సును సీజ్ చేశారు.

లక్షలు పోసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తే.. వారి భద్రతను యాజమాన్యాలు గాలికి వదిలేశాయి. అసలు డ్రైవర్ ఎలాంటి పరిస్థితిలో ఉన్నాడనే విషయాన్ని సైతం గమనించలేకపోతున్నారు. తప్పతాగి వస్తున్నా గుర్తించలేకపోతున్నారు. ఇది యాజమాన్యాల నిర్లక్ష్యానికి నాంది. డ్రైవర్లు కూడా స్కూల్ బస్సు కావడంతో తమను పోలీసులు ఆపరని, తనిఖీ చేయరని ఇలా తప్పతాగి వస్తున్నారు. ముందే సిటీలో వాహనాల రద్దీ రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఇంత మోతాదులో తాగి నడిపితే.. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహించాలి? ఇప్పటికైనా పాఠశాల నిర్వాహకులు కళ్లు తెరుచుకోవాలని.. ఫీజుల వసూళ్లు, అడ్మిషన్లపై దృష్టి పెట్టడం కాకుండా.. తమను నమ్మి స్కూల్‌లో చదువుతున్న చిన్నారుల భద్రతపై దృష్టి పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## 4 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ కొనసాగుతోంది. మూడో రోజు ఇవాళ 4 ఎకరాల విస్తీర్ణం వరకు రైతుభరోసా నిధులు జమ కోసం ప్రభుత్వం మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. మరో 21.89 లక్షల ఎకరాలకు సంబంధించి 6.33 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.5215.26 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసి 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించినట్లైంది. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతుభరోసా నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసా విషయంలో భారాస నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదన్నారు.

"గతంలో భారాస ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయింది. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నాం. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్ సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వదిలేస్తే.. మేం అధికారంలోకి రాగానే ఆ నిధులు కూడా చెల్లించాం. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. సీఎం ఇచ్చిన హామీ మేరకు వానాకాలం రైతుభరోసా నిధులు జమ చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా 9 రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికైనా భారాస నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి. లేదంటే రైతాంగం ఎప్పటికీ క్షమించదు" అని మంత్రి తుమ్మల అన్నారు.

## ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస

**హైదరాబాద్ జూన్ 18(సిద్దిపేట పవర్):**

బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయమేంటో చెప్పామంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గర సమాధానం లేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసం ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"భాజపా భరోసా కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలను స్వీకరించాం. అనేక మంది దివ్యాంగులు వచ్చి తమ సమస్యలు తెలిపారు. వారికి ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రతి పల్లెలో కాంగ్రెస్ ఇమేజ్



భూస్థాపితం అయింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస. కేసీఆర్ డైరెక్షన్‌లో తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆయన చేస్తున్న పని పవర్ పాయింట్ ప్రజంటేషన్. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే నాటకాలాడుతున్నారు. భాజపాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. నన్ను సిట్ పిలవలేదు. మహేశ్‌కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదు" అని అర్వింద్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో పేదల కోసం చారిత్రాత్మక నిర్ణయం: సన్న బియ్యం పంపిణీ

- ఒకేసారి మూడు నెలల ఉచిత సన్న బియ్యం పంపిణీ.
- గత బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.
- దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్



**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూన్ 18** దేశం మొత్తంలో పేదలకు సాధారణంగా దొడ్డి బియ్యం పంపిణీ జరుగుతున్నప్పటికీ, తెలంగాణ మాత్రం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రంగా నిలిచిందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ పేర్కొన్నారు. అక్బర్ పేట భూంపల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, ఇది పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను స్పష్టం చేస్తుందని తెలిపారు. ఒకేసారి మూడు నెలల ఉచిత రేషన్ బియ్యాన్ని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయడం సంతోషకరమైన విషయమని తెలియజేశారు. ఇప్పటికి 80శాతం పంపిణీ పూర్తయిందని, మిగతా 20శాతం ప్రజలు బియ్యాన్ని రేషన్ షాప్ ల వద్ద తీసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఒక్క కొత్త రేషన్ కార్డునూ జారీ చేయలేదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో ఇప్పటికే మూడు లక్షల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని చూపుతోందన్నారు.అలాగే, వర్షాకాలం పెట్టుబడి సాయంగా రైతులకు 9000 కోట్ల రూపాయల "రైతు భరోసా" నిధులను విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ వర్షాకాల పంటలో రైతులు సన్న వడ్లను పండించాలని కోరారు. సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ తెలిపారు.

# సీనియర్ జర్నలిస్ట్ అహోబిలం వెంకటేశ్వర్లు జన్మదిన శుభాకాంక్షలు



**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూన్ 18** సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం సీనియర్ జర్నలిస్ట్ అహోబిలం వెంకటేశ్వర్లు నియోజకవర్గం జిల్లా స్థాయిలో అవార్డు సాధించిన వెంకటేశ్వర్లకు దుబ్బాక ప్రెస్ క్లబ్ తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దుబ్బాక ప్రెస్ మిత్రులు. ఎల్లప్పుడూ రాజకీయాల కోసం నిరంతరం వెన్ను పేపరు ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల కోసం తన త్యాగం చేసిన ఘనత సీనియర్ జర్నలిస్ట్ అహోబిలం వెంకటేశ్వర్లకు దుబ్బాక రాజకీయాలు అధికారులతో అనుభవం కలిగిన జర్నలిస్టులకు అండదండగా ఉంటూ ప్రజల మధ్యలో ఉంటూ నిరంతరం ప్రజల సేవకు పని చేసే ఏకైక రిపోర్టర్ వెంకన్న గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దుబ్బాక నియోజకవర్గం జర్నలిస్టులు





# 995-1996 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు సీసీ కెమెరాలు అందజేత

**చిన్నకోడూర్,జూన్ 18 ( సిద్దిపేట పవర్):** మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు 1995 1996వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు సీ.సీ కెమెరాలు అందజేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కోరిక మేరకు .పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఎన్నో జన్మలెత్తిన పాఠశాలకు యొక్క రుణం తీర్చుకోలేనిదని అందులో భాగంగానే మా వంతుగా.సీ.సీ కెమెరాలు సామాజిక నేత్రాల ఏర్పాటుకు ముందు వచ్చాయని ఇంతకుముందు పాఠశాలలో ఏదైనా సహాయ సహకారం అవసర పడితే మా వంతు సహాయ సహకారం ఎల్లవేళలా ముందుంటామని సూచించారు.ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, బిక్షపతి ,మురళి ,కృష్ణ, కవిత, ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు బొమ్మల. యాదగిరి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

చిన్నకోడూర్ ,జూన్ 18 (సిద్దిపేట పవర్):ఈటి వలన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు బొమ్మల యాదగిరి తల్లి ఎల్లమ్మ సంవత్సరీకం సందర్భంగా చిన్నకోడూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీసం .మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర ఆత్మ శాంతి చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆ దేవుని ఎల్లవేళలా కోరుకుంటున్నామని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్ ,మండల ఉపాధ్యక్షులు సందబోయిన పరశురాములు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు హర్షిస్తున్నారన్న మంత్రి పొన్నం

- తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన పై ప్రజలు హర్షం .. రాష్ట్ర ఆర్టీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అత్యాధునికంగా 10 కోట్ల రూపాయలతో బస్సు షెల్టర్ నిర్మాణం





**సిద్దిపేట పవర్ ఖమ్మం జిల్లా జూన్ 18:** తెలంగాణ ఆర్టీసీ మధిర నియోజకవర్గ కేంద్రంలో 10 కోట్ల రూపాయలతో నూతన బస్ స్టేషన్ కు భూమి పూజ చేసి శంకు స్థాపన & నూతన ఆర్టీసీ బస్సులను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభోత్సవం చేశారు మధిర బస్ స్టేషన్ 35 సంవత్సరంలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ బస్ స్టేషన్ ను ఆధునికరించే ఉద్దేశంతో 10 ప్లాట్ ఫామ్ లతో సుమారు 10 కోట్ల ఖర్చుతో, 2 ఎకరాల 24 గుంటలలో నూతన బస్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ బస్ స్టేషన్ దగ్గర్లోనే ఉన్నటువంటి రైల్వే స్టేషన్ ను అనుసంధానం చేస్తూ ప్రయాణికులకు అనుగుణంగా వారి సౌకర్యార్థం నూతన బస్ స్టేషన్ నిర్మించబడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వర రావు,జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు

మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ఆర్టీసీ రవాణా శాఖ మంత్రి మాట్లాడుతూ మీ అందరి ఆశీర్వాదంతో తెలంగాణ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి రాగానే 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని పొన్నం ప్రభాకర్ తెలిపారు ఆర్టీసీ గత 10 సంవత్సరాలుగా ఒక కొత్త బస్సు కొనలేదు,ఒక ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు, పి ఎఫ్,సిసిఎస్ సొమ్ములు వాడుకొని ఆర్థిక ఇబ్బందులు కలుగజేసిందనీ ఉన్నారు 55 రోజుల ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసి కార్మికులు మరణిస్తున్న అప్పటి ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదనీ ఆర్టీసీ నీ నిర్వీర్యం చేశారని అన్నారు ఆర్టీసీ అస్తవ్యస్తం చేశారనీ.మీ ఆశీర్వాదంతో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కి జీవం పోసిందన్నారు ఇప్పుడు బస్సులకు డిమాండ్ పెరిగిందనీ కొత్త బస్సులు కొనీ,నూతన నియామకాలు చేపట్టామని మహిళా సంఘాలు ద్వారా మహిళలే బస్సులకు యజమానులుగా మారుతున్నారనీ అన్నారు ఇప్పటి వరకు 186 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని అక్క చెల్లెలా ప్రయాణ చార్జీలు ఆర్టీసీ ప్రభుత్వం కడుతుందనీ అన్నారు ప్రయాణికుల సౌకర్యం కోసం నూతన బస్ స్టేషన్ ల నిర్మాణం చేస్తుందనీ ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ ల కృషితో ఆర్టీసీ గ్రామగ్రామాన బస్సు వస్తుందన్నారు సంస్థ పరిరక్షణ ,ప్రయాణికుల సౌకర్యం,ఉద్యోగుల సంక్షేమం నినాదంతో ఆర్టీసీ సంస్థ ముందుకు పోతుందనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సహచర మంత్రుల సహకారంతో ఆర్టీసీ సంస్థను ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు మధిర లో పక్కనే రైల్వే స్టేషన్ ఉంది.. ఇప్పుడు బస్ స్టేషన్ నిర్మాణం జరుగుతుండడంతో ప్రయాణికులకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా నూతన బస్ స్టేషన్ లో టాయిలెట్స్ నిర్మాణం , వెయిటింగ్ హాల్,షాపింగ్ కంప్లేస్ అధునాతన హంగులతో నిర్మాణం జరుగుతుందనీ ఈరోజు వరకు దాదాపు 5 వేల కోట్లు రైతు భరోసా కింద పంట సహాయం అందిస్తున్నామన్నారు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 80 శాతం ప్రజలు వాడుకుంటున్నారని 500 కి గ్యాస్ అందిస్తున్నామని.. సన్న బియ్యం పంపిణీ..సన్నవడ్లకు 500బోనస్ఇస్తున్నామన్నారు ఇప్పటి వరకు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. చదువుకునే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించడానికి డైట్ కాస్మొటిక్ చార్జీలు పెంచాం. సూపర్ లగ్జరీ, 40 డీలక్స్ మరియు మహాలక్ష్మి ప్రయాణించే 81 ఎక్స్ ప్రెస్, 74 పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు 110 ఎక్స్ ప్రెస్. 117 పల్లె వెలుగు ప్రైవేట్ హైర్ బస్సులు ఉన్నాయన్నారు ఖమ్మం రీజియన్ నుండి ప్రతిరోజు సుమారు 2.62 లక్షల కిలోమీటర్లు నడుపుతూ సుమారు 2 లక్షల 10 వేల ప్రయాణికులను తమ తమ గమ్య స్థానాలకు చేరవేయబడుతుందని అందులో సుమారు 1 అందులో సుమారు 12 వేల మహాలక్ష్మిలు ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు బస్సులలో ప్రయాణిస్తున్నారు .ఈ బస్ స్టేషన్ నుండి ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ ఖమ్మం రూట్ లలో రోజుకు సుమారు 170 ట్రిప్ లు నడపబడుచున్నవనీ. మధిర డిపో పరిధి లోని మధిర, ఎర్రుపాలెం, వైరా కల్లూరు మండలాలను అనుసందనిస్తూ ఆయా బస్ స్టేషన్ ల నుండి సుమారు 263 ట్రిప్ లతో వివిధ గ్రామా

# సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ తన పద్ధతి మార్చుకోవాలి

**సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి అరుణ్ కుమార్**

**చేర్యాల, జూన్ 18 (సిద్దిపేట పవర్)** చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన పోనుగోటి శ్రీనివాసరెడ్డి సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు కాదని, గత కొద్ది కాలంగా సొంత పనులు చేసుకుంటూ స్తబ్దతగా ఉన్నాడని అతనిని ఈరోజు సిపిఎం మండల కమిటీ సభ్యుడనీ కనీస అవగాహన లేకుండా తప్పుడు ప్రకటనలు చేస్తూ అతనిని సిపిఐ పార్టీలో చేర్చుకున్నట్లు గా ప్రకటనలు ఇవ్వడం సరైన పద్ధతి కాదని ఇలాంటి ప్రకటనలు ఇవ్వడం మానుకోవాలని సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్ హెచ్చరించారు, బుధవారం రోజున సిపిఎం చేర్యాల మండల ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ కార్యాలయంలో జరిగింది, ఈ సమావేశంలో అరుణ్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బూర్జువాశక్తులు బలపడుతున్నటువంటి తరుణంలో వామపక్ష ఐక్యతకు కృషి చేయాల్సిన సందర్భంలో వామపక్ష ఐక్యత కి విఘాతం కలిగించే విధంగా మంద పవన్ వ్యవహరించడం సరైనది కాదనీ అరుణ్ అన్నారు. చేర్యాల ప్రాంతలో గ్రామ గ్రామాన బలంగా ఉన్న సిపిఎం పార్టీని బలహీనపరిచి ఆస్థానంలో బలపడాలని సీపీఐ నాయకులు కళలు కంటున్నారని అరుణ్ ఎద్దేవా చేశారు,ఇలాంటి చర్యలు వామపక్షాల శక్తిని బలహీనపరిచే విధంగానే ఉంటుంది తప్ప బలపడే పరిస్థితి ఉండదని ఇలాంటి విధానాలు మానుకొని వామపక్ష ఐక్యతకు కృషి చేయాలని అన్నారు. గత కొంత కాలంగా సిపిఎం పార్టీ కార్యక్రమాలకు సమావేశాలకు దూరంగా ఉంటున్న పొనుగోటి శ్రీనివాసరెడ్డికి సిపిఎం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కింది స్థాయి నాయకులు తప్పులు చేస్తే సరిచేయాల్సింది పోయి జిల్లా కార్యదర్శి మంద పవన్ తానే తప్పుడు దొరనులకు పాల్పడడం సమంజసం కాదన్నారు,ఇప్పటి కైన సీపీఐ నాయకులు తప్పుడు ప్రకటనలు మానుకొని వామపక్ష ఐక్యతకు బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాలోజు శ్రీహరి, మూస్త్యాల ప్రభాకర్, కాశెట్టి ఆంజనేయులు, దండ్ల రమేశ్, గందాల బాలు, గర్నేపల్లి చెంద్రం, ఔషర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు



# మానవత్వం చాటుకున్న గ్రామస్తులు

**చనిపోయిన నిరుపేద కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయం**

**నంగునూరు, జూన్ 18 ( సిద్దిపేట పవర్ ):** చనిపోయిన నిరుపేద కుటుంబానికి గ్రామస్తులంతా అండగా నిలిచారు. తలా కొంత పోగేసి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామస్తుల సాయం నిరుపేద కుటుంబానికి భరోసానిచ్చింది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పేర్న రాజు అనారోగ్యంతో బుధవారం మరణించారు. దీంతో గ్రామస్థులు చందాలు వేసుకుని రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గ్రామస్థులు తోచినంత ఆర్థిక సహాయం అందించడంతో జమ అయిన డబ్బుల నుంచి రూ.35,000 ల నగదును, ఒక క్వింటాలు బియ్యాన్ని రాజు కుటుంబ సభ్యులకు అందించారు.





# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**దిశ కమిటీ సభ్యులు సుంకోజు ప్రవీణ్**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూన్ 18**

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలని సందర్శించిన దిశ కమిటీ సభ్యులు సుంకోజు ప్రవీణ్ అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించడం జరిగింది ఉపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన సమస్యలు ఉంటే వాటిని చెప్తే జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తా అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో బీజేవైయమ్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లుగారి రమణారెడ్డి,పగడాల నరేందర్,బీజేపీ జిల్లా నాయకులు రమేష్ రెడ్డి పల్లె మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి వివేకు ను కలిసిన ఇన్చార్జులు.

ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బాధ్యతలు స్వీకరించిన శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామిని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన *సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ. దుబ్బాక ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి .




# ఘనంగా చండీ హోమం




- అమ్మవారికి పంచామృత స్నానం
- వైభవంగా శృంగేరి మఠంలో వార్షికోత్సవం

**సిద్ధిపేట జూన్ 18**

సిద్ధిపేట సమీపంలోని శృంగేరి మఠంలో బుధవారం వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలోని శారదామాత కు ఉదయం పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం వేద మంత్రోచ్చారణాల మధ్య చండీ హోమం జరిగింది .ఈ సందర్భంగా సుహాసిని పూజ నిర్వహించారు. అనంతరం చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. తర్వాత అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఉత్సవాలలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కిషన్ సింగ్ , ఆలయ ప్రతినిధులు ఉప్పల శ్రీనివాస్ , శ్రీకాంత శర్మ , నాగరాజు శర్మ , కే .శివ చరణ్ తదితరులు పాల్గొన్నారు.




# బ్రాహ్మణ పరిషత్ 50%రిజర్వేషన్ కల్పించాలి

**తెలంగాణ శ్రీ వైష్ణవ సేవా సమితి జేఏసీ చైర్మన్ పిచర కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు.**

**సిద్ధిపేట పవర్:**

ఎండోమెంట్ పరిధిలోని దేవాలయాల రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు సిద్దిపేట గణేష్ నగర్ హనుమాన్ దేవాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిలకమర్రి వెంకట రమణచార్యులతో కలిసి శ్రీ వైష్ణవ సెన్సెన్స్ సంబంధించిన నమూనా ప్రతిని విడుదల చేశారు అంతకుముందు అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సిద్ధిపేట పట్టణం కు చెందిన శ్రీ వైష్ణవుడు అమరావది కృష్ణమాచార్యులకు తెలంగాణ శ్రీ వైష్ణవ సేవా సమితి ఆధ్వర్యంలో లక్ష పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు శ్రీ వైష్ణవ సేవా సమితి సత్కార్లతో సరిపెట్టకుండా ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు ఈ సమావేశంలో శ్రీ వైష్ణవ సేవా సమితి సభ్యులు శశికిరణ్ రంగాచారి నరసింహచార్యులు గోపి కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు



# అయినాపూర్ పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం

**సర్పంచ్ స్వామి గౌడ్**

మండలంలోని అయినా పూర్ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి అవసర రిత్యా రసూలాబాద్ తాజా మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్ గారు పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు,ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతులపై అభివృద్ధికై స్వామి గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి పదివేల రూపాయలు అందజేయడం జరిగిందని అంతేకాకుండా వారి అబ్బాయిని ఈరోజు మా పాఠశాలలో చేర్పించడం చాలా సంతోషమని పదిమంది విద్యార్థులను ప్రైవేటు పాఠశాల నుండి మన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం చాలా గొప్ప విషయమని తెలుపుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉచిత దుస్తులు ఉచిత పాఠ్య పుస్తకాలు సాంస్కృతిక క్రీడా మైదానం ఎటువంటి ఫీజు లేకుండా ఉచిత విద్య అందిస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం,ఉపాధ్యాయులు పబ్బోజు రాజమౌళి, జి దశరథం,డి రాజయ్య,ఎస్ సిద్ధిలింగం,డి అజిత విజయ్ కుమారి, బి సంధ్యారాణి,ఎం యాదగిరి, ఎం శివుడు,ఎం ఎల్లయ్య, డి వెంకటయ్య,ఎస్ జైపాల్ రెడ్డి,ఎండి సయ్యద్, జి సుజాత, పి నర్సింలు, వెంకటేష్, బాలరాజులు పాల్గొన్నారు.




# నిబంధనల ప్రకారం పకడ్బందీగా గురుకులాల నిర్వహణ...

- గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ సర్వీస్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- గురుకులాల్లో మంజూరైన సీట్లను పూర్తి స్థాయిలో నింపాలి
- ప్రతి గురుకులంలో తప్పనిసరిగా దోమల మెష్ జాలి ఏర్పాటు చేయాలి
- గురుకులాలను రెగ్యులర్ గా ఉన్నతాధికారులు తనిఖీ చేయాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర బిసి సంక్షేమం, రవాణా శాఖల మంత్రితో కలిసి సమీక్షించిన డిప్యూటీ సిఎం.

**సిద్ధిపేట పవర్ ఖమ్మం, జూన్ -18:**

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పక్కాగా గురుకులాలను నిర్వహించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు.బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి సమీక్షించారు. గురుకులాల నిర్వహణ, స్టడీ సర్కిల్ పని తీరు, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా శాఖ, విద్యుత్ శాఖ పని తీరు, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పురోగతి పై సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గురుకులాల పాఠశాలల ప్రారంభం నాటికి పిల్లలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు పంపిణీ చేయాలని, దీనికి అవసరమైన నిధులు ముందుగానే విడుదల చేయడం జరిగిందని అన్నారు. సరైన వసతులు లేని గురుకులాల భవనాలను అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయ భవనాలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గురుకుల పాఠశాలల్లో పిల్లలకు దోమలు కుట్టి ఇబ్బంది పడటానికి వీలు లేదని, ప్రతి గురుకులంలో పూర్తి స్థాయిలో మెష్ జాలీ లు ఏర్పాటు చేయాలని అన్నారు. హాస్టల్స్ లో అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని అన్నారు. కామన్ డైట్ ప్రోగ్రాం సంబంధించి షెడ్యూల్ తప్పనిసరిగా డిస్ ప్లే చేయాలని అన్నారు. జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు గురుకులాలను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని, దీనికి సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. గురుకులాల పరిసరాల్లో పండ్ల మొక్కలను పెద్ద స్థాయిలో పెంచాలని, దీనివల్ల పచ్చదనం పెరగడంతో పాటు విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందుతుందని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కోటి మొక్కల వరకు పెంచుతున్నామని అన్నారు. ప్రతి మొక్క మీద ప్రభుత్వం కనీసం 300 రూపాయల వరకు ఖర్చు చేస్తుందని, ఒక జిల్లాలో సంవత్సరానికి 300 కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సర్వైవల్ పై శ్రద్ధ పెట్టాలని అన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఎన్ని బ్రతికాయో వాస్తవిక రిపోర్ట్ అందించాలని అన్నారు. గురుకులాల భవనాలకు సంబంధించి రెంట్, డైట్ చార్జీల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేస్తుందని, పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు అందించడంతో పాటు అది సౌకర్యవంతంగా ఉండేలా మనం చర్యలు చేపట్టామని, డిమాండ్ ఉన్న రూట్ లలో అదనపు బస్సులు నడపాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ లను గుర్తించి ప్రతిపాదనలు అందిస్తే నూతన బస్సులు కొనుగోలు చేసి పంపడం జరుగుతుందని అన్నారు.




సమీక్ష లో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురుకులాలలో చేపట్టిన చర్యలు, గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ, వన మహోత్సవం కార్యక్రమంలో తాటి, ఈత ఖర్జూర మొక్కల పెంపకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గురుకులాల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గు పర్చాల్సిన అవసరం ఉందని, ఐఐటి, నీట్ వంటి పరిక్షలలో మంచి ఫలితాలు సాధించేలా శిక్షణ అందించాలని అన్నారు. పెరిగిన డైట్ చార్జీలు వినియోగిస్తూ ప్రభుత్వం సూచించిన కామన్ డైట్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని అన్నారు. గురుకులాలో మంజూరైన సీట్లు పూర్తి స్థాయిలో నింపాలని, సొంత భవనాలు లేని గురుకులాలకు అవసరమైన భూమి గుర్తించాలని, ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం నిర్మించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ యువతకు ఖమ్మం జిల్లా హెడ్ క్వార్టర్ లో బీసీ స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించేలా చూడాలని అన్నారు. హైదరాబాద్ కు రావాల్సిన అవసరం లేకుండా అవసరమైన అన్ని రకాల పుస్తకాలు, శిక్షణ మన ఖమ్మంలో అందించాలని అన్నారు. ప్రస్తుత సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో 81 వేల ఈత మొక్కలు నాటేందుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలని, గీత కార్మికుల సొసైటీ లను వీటిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేస్తూ కాలువల వెంబడి, ఖాళీ ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వీటిని పెద్ద ఎత్తున పెంచాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత నూతన బస్సు సర్వీసుల కోసం డిమాండ్ వస్తుందని,స్థానిక ఎమ్మెల్యేల నుంచి బస్సు సర్వీసుల ప్రతిపాదనలు తీసుకొని అందించాలని, డిమాండ్ కు అనుగుణంగా అదనపు బస్సులను కేటాయిస్తామని, రాబోయే రోజులలో హైదరాబాద్ కు ఎలక్ట్రిక్ బస్సులు వచ్చే నేపథ్యంలో జిల్లాలకు అదనపు బస్సులు అందుతాయని మంత్రి తెలిపారు. నగర పరిధిలో పీఎంఈ స్కీం కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రూరల్ కనెక్టివిటీ బస్సుపై స్టడీ చేసి నూతన రూట్ లను ప్రతిపాదించాలని అన్నారు. లాండ్రీ లకు, దోబి ఘాట్, సెలూన్ లకు విద్యుత్ సరఫరా సజావుగా అందాలని అన్నారు. గురుకులాల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళా చైర్మన్ నాయుడు సత్యనారాయణ, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రథమ వర్ధంతికి హాజరైన పూజల చెరుకు.

సిద్ధిపేట కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి తల్లి కీ. శే. బొమ్మల ఎల్లవ్వ ప్రథమ వర్ధంతి సందర్భంగా హాజరై వారి చిత్ర పటానికి నివాళులు అర్పించిన సిద్ధిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ రాష్ట్ర మైనారిటీ నాయకులు కలీముద్దీన్ అహ్మద్, కౌన్సిలర్ పయ్యావుల ఎల్లం యాదవ్, అమరేందర్ రెడ్డి,చాంద్ పాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాహబ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రషద్,సీతబాలు, శ్రీనివాస్ బొమ్మల ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంశీ, నియోజకవర్గ అధ్యక్షులు బడికోల్ రాకేష్ అధ్యక్షులు సాదుల సాయి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు..



# ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం.

**సిద్దిపేట పవర్:**

కొమురవెల్లిమండలంలోని గురువన్న పేట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ రమేష్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నే గుణాత్మక విద్య అందుతుందని ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా అడ్మిషన్లు చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. త్వరలో వెయ్యి రూపాయల నగదును అందజేస్తానన్నారు.



కార్యక్రమంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ రవీందర్.

**సిద్దిపేట పవర్:**

చిట్టాపురం శ్యామల భర్త నాగరాజు, వయస్సు 30 సంవత్సరములు, నివాసం కోటిలింగాల టెంపుల్ ఏరియా సిద్దిపేట పట్టణం. కుటుంబ కలహాలతో పిల్లలతో యుక్తంగా ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుండి బయలుదేరగా సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ వద్ద అటు ఇటు తిరుగుచుండగా గమనించిన సిద్దిపేట ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్, ఆమెను గమనించి ఆమె దగ్గరికి వెళ్లి వివరాలు కనుక్కొని అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కౌన్సిలింగ్ నిర్వహించి. మీ ఆయన ఫోన్ నెంబర్ ఇస్తే పిలిపించి అప్పగిస్తామని చెప్పగా నేను వెళ్ళను అని చెప్పగానే సిద్దిపేట సఖి సెంటర్ వారికి ఫోన్ చేసి వారిని పిలిపించి అప్పగించి మానవత్వాన్ని చాటారు.




# సిపిఐ జిల్లా కార్యదర్శిని విమర్శించే హక్కు సిపిఎం నాయకులకు లేదు

**సిపిఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి**

**సిద్ది పేట పవర్ చేర్యాల 18 జూన్**

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ను విమర్శించే నైతిక హక్కు సీపీఎం నాయకులకు లేదని సీపీఐ చేర్యాల మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఎం పార్టీ నాయకుల విధానాలు నచ్చక సీపీఐ చేస్తున్న పోరాటాలకు సిద్ధాంతాలకు ఆకర్షితులై కడవేరుగు గ్రామానికి చెందిన సీపీఎం మండల కమిటీ సభ్యుడు పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి స్వచ్ఛందంగా సీపీఐ పార్టీలో చేరితే సీపీఐ పై అక్కసుతో పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ పై తప్పుడు ప్రకటనలు చేయడం తగదన్నారు. సీపీఎం నాయకులను బలవంతంగా చేర్చుకోలేదని వారి ఇష్టంతోనే చేరుతున్నారని అన్నారు. సీపీఐ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక రాజకీయంగా ఎదుర్కోలేక గతంలో తమ పార్టీ నాయకులపై దాడులు చేశారని గుర్తు చేశారు. సీపీఎం నాయకుల విధానాలు చూస్తే వామపక్ష ఐక్యతకు భంగం కలిగించే విదంగా ఉందన్నారు. సీపీఐ పార్టీని, నాయకులను విమర్శిస్తే ఊరుకునేది లేదని అన్నారు.

